# నీతిలేని కథ

## నందం రామారావు

"ఏయ్ రిక్షా ! వస్తావా ?"

అప్పుడే బేరం దింపి చెమట తుడుచుకుంటున్న వీరయ్య ఆమాట విని తలెత్తి చూశాడు.

ఎదురుగా ఎవరో సూట్‌వాలా !

ఒక చేత్తో సూట్‌కేస్ పుచ్చుకుని, మరో చేత్తో గాగుల్స్ సరిచేసుకుంటూ ఠీవిగా నిలబడి వున్నాడు.

"వొత్తాను బాబూ. ఎక్కడికి పోవాలా?" అనడిగాడు వీరయ్య.

"బస్సుస్టాండుకి ఎంతివ్వమన్నావ్ ?" అన్నాడు సూట్‌వాలా.

"రెండు రూపాయలిప్పించండి బాబూ !!"

"ఏమిటీ ? రెండు రూపాయలా ? నువ్వీవూరికి క్రొత్తనుకుంటాను. రూపాయిస్తాను. వస్తావా ?"

వీరయ్య నివ్వెరపోయాడు ఆమాటకి. బస్సుస్టాండుకి రూపాయా ? ఎంతలేదన్నా రెండు మైళ్ళపైన వుంటుంది. అందులోనూ ఎండ మాడ్చేస్తోంది.

రానని చెప్పాలనుకున్నాడు. మరో రోజైతే అలాగే చెప్పేవాడు. కానీ, ఈ రోజు లేస్తూనే అనుకున్నాడు — సాయంత్రం లోపు ఇరవై రూపాయిలు సంపాదించాలని. అందుకే, ఏ బేరాన్నీ పోనియ్యడం లేదు !

"ఏమిటీ చెప్పు ?"

వీరయ్య భుజం మీదున్న తుండుగుడ్డను దులిపి, ముఖం తుడుచుకుంటూ —

"రూపాయన్నర ఇప్పించడయ్యా !" అన్నాడు.

సూట్‌వాలా కాదన్నాడు.

చివరకు బేరం రూపాయిన్నరకు కుదిరింది.

సూట్‌వాలా రిక్షా ఎక్కాడు.

వీరయ్య రిక్షా తొక్కుతున్నాడు. టైమ్ మూడు గంటలవుతోంది. ఇంకా చల్లబడలేదు. అసలే వేసవికాలం.

వీరయ్యకి ఆయాసం వస్తోంది. చేతులు జారిపోతున్నాయి. కాళ్ళు తడబడిపోతున్నాయి.

ప్రొద్దున్న ఇంటినుంచి వస్తూ గంజినీళ్ళు మాత్రం తాగాడు. మధ్యాహ్నం పావలా బన్ను, ఇరవై పైసల 'టీ'తో సరిపెట్టుకున్నాడు.

సాయంత్రం ఏడుగంటలకి ఇరవై రూపాయలు సంపాదించాలి. ఆ డబ్బుతో కడుపునిండా తాగెయ్యాలి. రోజూ, డబ్బులేక గ్లాసు, అరగ్లాసుతో సరిపుచ్చుకుంటున్నాడు. ఈరోజైనా పండుగ చేసుకోవాలి. ఇప్పటికి పన్నెండు రూపాయలు సంపాదించాడు. ఇంకా నాలుగ్గంటల టైముంది. మిగతా ఎనిమిదిరూపాయలూ సంపాదించాలి !

వీరయ్య తాగబోయే సారాని తలచుకుంటూ వుషారుగా రిక్షా తొక్కసాగాడు.

* * *

రాత్రి ఎనిమిదిగంటలకు వీరయ్య 'సారా' పూటుగా తాగేసి హాయిగా పాడుకుంటూ ఇంటి దారిపట్టాడు.

వీరయ్య ఇంటికొచ్చేసరికి, అప్పటివరకూ మొగుడి కోసం ఎదురుచూస్తూ కూర్చున్న ఎల్లమ్మ లేచి గబగబా ఎదురొచ్చింది. వీరయ్య, ఎల్లమ్మను పక్కకు తోసేసి లోపలకొచ్చి నులక మంచం వాల్చుకుని పడుకున్నాడు.

మొగుడు నూకలుగానీ, డబ్బుగానీ తెచ్చి తన చేతిలో పెడతాడని ఆశగా చూస్తున్న ఎల్లమ్మకి, వీరయ్య అలా వెళ్ళి పడుకోవడంతో కోపం ముంచుకొచ్చింది.

ఇంట్లో నూకలుకూడా లేవు ! ప్రొద్దుట నుంచీ పిల్లలు ఆకలని ఏడుస్తుంటే —

"ఆనికి మీ అయ్య నూకలు తెత్తాడు. వొండిపెడ్తా" అంటూ ఓదార్చింది ఇప్పటి వరకూ పిల్లల్ని.

ఈడు డబ్బంతా తగలేసి పీకల్దాకా తాగొచ్చాడన్నమాట !

అప్పటివరకూ వున్న నీరసంపోయి, ఆవేశం రాగా వీరయ్య దగ్గరకొచ్చి చెయ్యి పట్టుకుని కుదుపుతూ —

"నిన్నే. లెగు !!" అంది ఎల్లమ్మ.

వీరయ్య బలవంతాన కళ్ళు విప్పుతూ — "ఏంటే నీ గోల !!" అన్నాడు.

"నూకలేవీ."

"లేవు. రేపు తెత్తాలే."

మొగుడు మాటలకి ఒళ్ళు మండిపోయింది ఎల్లమ్మకు. చూరులో వున్న కత్తి తీసి మొగుడి గుండెల్లోకి దింపాలన్నంత కోపం కలిగింది !

రెండు రోజులయింది పిల్లలు అన్నంతిని. వీరయ్యేమో సంపాదించిందంతా తాగేసి వస్తున్నాడు.

ఎప్పటివో ముక్కిపోయిన నూకలుంటే ప్రొద్దున్న గంజికాసి పిల్లలకు తలో గుక్కెడు పోసింది.

ఇప్పుడేం చెయ్యాలి ?

ఎల్లమ్మ చుట్టూ చూసింది.

పిల్లలు బిక్కమొగాలేసుకుని తలోచోట కూర్చున్నారు. ఆ స్థితిలో వాళ్ళని చూడగానే ఆ తల్లికి జాలి, దిగులూ కలిగాయి. ఎల్లమ్మకి ఆకలి బాధ ఎక్కువవడంతో కోపం, ఆవేశం చల్లారి నీరసం ముంచుకొచ్చింది.

ఎల్లమ్మకు ఆరుగురు సంతానం. పెద్దపిల్ల నీలి పదహారేళ్లది. ఆ తర్వాత వెంకటేశు పదమూడేళ్లవాడు. వాడి తర్వాతవాళ్లు చిన్నపిల్లలు.

ఇదివరకు ఎల్లమ్మ నాలుగిళ్లల్లో పాచిపని చేసి భర్త డబ్బులిచ్చినా, ఇవ్వకపోయినా ఇల్లు గడుపుకొచ్చేది ! కానీ, ఆఖరిపిల్ల పుట్టాక పెద్ద జబ్బుచేసి నీరసించిపోయింది. ఇంట్లో పని కూడా చేయలేకపోయేది. నీలి పదహారేళ్లదయినా సరైన తిండిలేక బొత్తిగా ఎండిపోయి వుండడంతో ఎక్కడాపనికి పెట్టలేదు. మొగుడు తీరు చూస్తుంటే నీలిని ఎక్కడో అక్కడ పనికిపెట్టకపోతే లాభంలేదనుకుంది. కానీ, నీలికి పని దొరికే వరకయినా ఈప్రాణాలు నిలుస్తాయో లేదోనన్న సందేహం కలిగింది ఎల్లమ్మకి.

రేపు గంజినీళ్ళైనా లేకపోతే ప్రాణాలు పోవడం ఖాయం. ప్రొద్దున్నే వీరయ్యచేత ఎలాగో అలా చారెడు నూకలైనా తెప్పించాలి !

* * *

ఉదయం బారెడు ప్రొద్దెక్కినా వీరయ్య మంచంమీద నుంచి లేవలేదు !

"ఏందయ్యోయ్. ఇంకా తొంగుండావే లెగు. లెగు" అంటూ చెయ్యి పుచ్చుకుని లేపబోయింది ఎల్లమ్మ.

చెయ్యి చురుక్కుమంది.

"ఓలమ్మో. ఈ మడిసికి జొరం వొచ్చి నట్టుండాదే. ఇప్పుడేం సెయ్యాల" అనుకుంది గాబరాగా.

"అమ్మా ! ఆకలే" పిల్లలు లేచి తల్లి చుట్టూ చేరారు.

అసలే విసుగ్గా వున్న ఎల్లమ్మ —

"తెల్లారిందా మీకు ?" అంటూ వాళ్ళకి తలోకటి అంటించి అవతలకు నెట్టింది.

ఎండ కరకరలాడుతోంది.

పిల్లలకి అన్నం కావాలి.

భర్తకి మందు కావాలి.

వీటన్నిటికీ డబ్బు కావాలి ?

ఎల్లమ్మ దిగులుగా వీరయ్య మంచం ప్రక్కనే కూర్చుంది.

నీలి, తాను ప్రొద్దున్న గుడికెళ్ళినప్పుడు ప్రసాదంగా తెచ్చుకున్న బెల్లంముక్కని నీళ్ళల్లో కలిపి పిల్లలచేత తాగించింది.

వీరయ్య మూలుగుతున్నాడు. ఆఖరి పిల్ల పాలకోసం ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయింది.

ఎల్లమ్మకుక్కూడా నీరసంతో కళ్ళు తిరుగుతున్నాయి. మంచం. పట్టీమీద తల వాల్చి కూర్చుంది.

అదిగో, ఆ సమయంలో వెంకటేశు తడికీ తోసుకుని లోపలకొచ్చాడు. లోపలంతా కలయ చూశాడు.

తుఫాను బీభత్సం తర్వాత పాడుపడిన వూరులా వుందా ఇల్లు !

అందరూ తలోచోటా నీరసంగా పడుకుని వున్నారు.

నిన్న పొద్దున్న అరగ్లాసుడు గంజిత్రాగి ఇంట్లోంచి బయట పడ్డాడు వెంకటేశు.

రాత్రి అయ్య నూకలు తెచ్చి వుంటాడు. అమ్మ అన్నం వండి వుంచుతుందనే ఆశతో వచ్చాడు.

ఇంటిస్థితి చూశాక ఒక్క క్షణం కూడా అక్కడ వుండబుద్ధి కాలేదు వెంకటేశుకు.

గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

* * *

సాయంత్రం ఆరు గంటలయింది.

వెంకటేసు వంతెన గట్టుమీద వెల్లికలా పడుకుని ఆకాశంవేపు చూడసాగాడు.

వంతెన క్రింద కాలువమీద నుంచి వచ్చే చల్లటి గాలి శరీరానికి తాకుతోంది. వంతెనమీద కార్లూ, రిక్షాలూ, సైకిళ్ళూ మనుషులూ ప్రవాహంలా సాగిపోతున్నారు.

'అయ్య తాగకుండా వుంటే ఎంత బావుణ్ణు.'

ఈ మాట ఎప్పుడూ అనుకుంటూనే వున్నాడు.

ఈ రోజూ అనుకున్నాడు.

ఇప్పుడూ అనుకుంటున్నాడు.

కానీ ఏం లాభం ?

వెంకటేశు కళ్లల్లో నీళ్లు తిరిగాయి !

క్షణ క్షణానికి పెరిగిపోయి, కడుపులోని ప్రేవుల్ని తినేస్తున్న ఆకలిని భరించలేక పోతున్నాడు.

ఏం చెయ్యాలి ?

ఎలా ఈ ఆకలిని చంపాలి ?

గట్టుమీద పడుకున్న వెంకటేశు నెమ్మదిగా లేచాడు. పొట్ట వెన్నుకి అతుక్కుపోయింది. నీరసంతో కళ్ళు తిరుగుతున్నట్టుగా అన్పించి, క్షణంసేపు వంతెన గోడకు ఆనుకుని నిలబడ్డాడు. ఆ తర్వాత జారిపోతున్న లాగూని పైకి లాక్కుంటూ, మెల్లగా నడిచి వంతెన దాటి రోడ్డుమీద కొచ్చాడు.

ఒక్కసారిగా లైట్లు వెలిగాయి. వీధులన్నీ పకపకా నవ్వుతున్నట్లున్నాయి. వెంకటేశు చుట్టూ చూస్తూ నడుస్తున్నాడు. అద్దాల తలుపుల్లోంచి రకరకాల తినుబండారాలు నోరు వూరిస్తున్నాయి.

హోటళ్ళల్లోంచి బయటకొస్తున్న ఖరీదైన మనుషులు, రోడ్డు ప్రక్కనున్న బళ్ళల్లోవి కొనుక్కు తింటున్న మామూలు మనుషులు.

వీరెవరూ వెంకటేశుని చూడ్డం లేదు.

ఎక్కడ చూసినా తినే వస్తువులే.

ప్రపంచంలోని ఆకలంతా వెంకటేశు కడుపులోనే వున్నట్టుంది !

వెంకటేశు రెండు మూడు తినుబండారాల బళ్ళముందు నిలబడి చేయి చాపాడు. కానీ, వాడికి తిట్లూ, విదిలింపులు మాత్రమే దక్కాయి ! వెంకటేశు అక్కడ్నుంచి కదిలి ఒక మిఠాయి షాపుముందు నిలబడ్డాడు.

ఎదురుగా కంటికి నిండుగా ఏవేవో తీపి పదార్థాలు !

దేగలాగ వాటివేపే చూస్తూ నుంచున్నాడు. కొందరు ఎవరిక్కావల్సినవి వాళ్ళు కొనుక్కుని వెళుతున్నారు. వెంకటేశు చూస్తూ సహించ లేకపోయాడు.

కడుపులో అంతులేని ఆకలి ! ఎదురుగ్గా ఆకలిని తీర్చే ఆహారం !

ఇప్పుడు తన ఆకలి తీరాలంటే ఆ పదార్థాలు తన చేతిలోకి రావాలి. తనకూ వాటికీ ఎక్కువ దూరంలేదు. చెయ్యేస్తే అందుతుంది. చెయ్యి వెయ్యడానికి జేబులో డబ్బులుండాలి. ఆ డబ్బులు లేకపోవడం వల్లనే ఆ పదార్థాలు తనకు కొన్నిమైళ్ల దూరంలో వున్నట్టుగావుంది.

''పో ... పో.''


కుక్కను విదిల్చినట్టు విదిల్చాడు షాపు యజమాని.

వెంకటేశుకి పట్టరాని దుఃఖం వచ్చింది. దుఃఖంతోపాటు ఆవేశం కలిగింది. క్షణంసేపు, కంటికి షాపులోవి తీపి పదార్థాలు తప్ప ఇతర ప్రపంచమే కన్పించలేదు.

అంతే !

మరుక్షణంలో నిలుచోడానికి ఓపిక్కూడా లేని వెంకటేశు రోడ్డుమీద పరిగెడుతున్నాడు.

ఏం జరిగిందో తెలుసుకునేసరికి షాపు



## చరితార్థత

శతాబ్దాల పోరాటానికి తుది మెట్టు
అహంకృత తెల్లవారి ఆట కట్టు
తరతరాల భరతజాతి విజయానికి తొలి మెట్టు
అర్ధరాత్రి జాతి అంత వెన్నెలతో కనుకట్టు
దివ్వె ఒకటి వెలిగింది; కాంతి రవ్వ విరిసింది
చీకటి దొంగల ప్రతి చేతికి కరదీపిక
మనీషులందించిన అమృతభాండం మన స్వాతంత్ర్యం
నేటి మనుషుల పాలిట మారింది స్వ(హా)తంత్రంగ
పొరుగువాణ్ణి దోచుకొనే తారకమంత్రంగ
అహర్నిశలు ఆడుతున్న మోసపు యంత్రంగ
స్వాతంత్ర్యపు ప్రౌఢకాంత కన్నీటిని చిమ్ముతోంది
భరతజాతి భవిత అంతా బూడిద పన్నీరు అవుతోంది
సమభావం, సంతోషం వారికి అందజేయ
మన స్వతంత్ర భారతినే సర్వజగతి పూజింపగ
ఇకనైనా పురోగమించి, చరితార్థత నందుకొందాం
స్వాతంత్ర్యపు సందేశం నరనరాల నింపుకొందాం
బజారుకెక్కిన మన భారతి కన్నీటిని తుడిచేద్దాం.

— "సుచంద్ర"

*

## ఏడాదికోసారి ఎగురు

ఈ జనం పెళ్ళిచూపుల్లో
పై మెరుగులకే మోసపోయిన వరులు
రాజకీయ వ్యాఘ్రాల మత్తు మాటలకు
మెత్తబడిపోయిన కంచి మేకలు
నిద్దమైన నిలువుటద్దంలో
ప్రతిబింబాన్ని నమ్మనివాళ్ళు
తెల్లని పాలలో నల్లని నీళ్ళే
ఎక్కువని ఎరగని వాళ్ళు
నినాదాల ఉరుముల్ని విని
ఆచరణ వర్షం కోసం
ఎదురుచూస్తున్న వాళ్ళు
చీకటి బజారులో పడి మగ్గుతున్న
వీళ్ళనే సూర్యుడు మేల్కొలుపుతాడు ?
ఓ ప్రియమైన పతాకా
అంతవరకు —
ఏడాదికోసారి ఇలాగే ఎగురు.

— 'పైడిపాల'

## నీతి లేని కథ

యజమానికి రెండునిముషాలు పట్టింది. మొదట తెల్లబోయి, ఆ తర్వాత తెలివితెచ్చుకుని —

"దొంగ. దొంగ" అని అరవసాగాడు.

రోడ్డుమీద వ్యక్తులు ఎక్కడివారక్కడ ఆగిపోయారు. వారిలో కొందరు ధర్మమూర్తులు, న్యాయాన్ని నిలబెట్టడానికి కంకణం కట్టుకున్న వారు వెంకటేశు వెనకే పరిగెత్తారు.

ఆకలితో నీరసించిపోయిన వెంకటేశు వేగంగా పరిగెత్తలేకపోతున్నాడు.

ఆకలి అన్నదేవిటో తెలియని ఆ వ్యక్తులు వేగంగా పరిగెడుతున్నారు వెంకటేశుని పట్టుకోవడానికి.

మరునిముషానికి వెంకటేశుని పట్టుకున్నారు. 'ఎలాగైతేనేం న్యాయాన్ని రక్షించాం' అన్నట్టు వాళ్ళ ముఖాల్లో విజయగర్వం తొంగి చూస్తోంది.

ఎముకుల పోగులాటి వెంకటేశు బక్కచిక్కిన శరీరంపై కొవ్వుతో బలిసిన కొన్ని చేతులు టపటపా పడ్డాయి.

మొదటి దెబ్బకే వెంకటేశు నేలకు కరుచుకుపోయాడు. చేతిలోని రెండు లడ్డూలు దూరంగా పడిపోయాయి. "పడిపోవడం అంతా వేషం. ఈడ్చికెళ్ళి పోలీస్టేషన్లో పడెయ్యండి. రోగం కుదుర్తుంది." ఎవరో ధర్మమూర్తులు సెలవిస్తున్నారు.

మరో ధర్మమూర్తి వెంకటేశు చెయ్యి పుచ్చుకుని లేపబోతున్నాడు.

ఇంతలో —

"ఆగండెహె. పసోడిని పట్టుకుని పసువులా కొడుతున్నారు" డబ్బాలో రాళ్ళుపోసి గిలకరించినట్టుగా మాటలు వినిపించగా అందరూ అటువేపు తిరిగారు.

పెద్ద పెద్ద పువ్వుల లుంగీ, తెల్లలాల్చీ, నల్లగా, పొడవుకుతగ్గ లావుతో రీవిగా నిలబడ్డ ఆ వ్యక్తిని చూసి అందరూ వెనక్కి తగ్గారు!

తమకంటే బలవంతులతో పోట్లాట పెట్టుకోవడం మంచిదికాదనే సూత్రం వాళ్ళకు తెలుసు. అందుకే మెల్లగా అక్కడ్నుంచి తప్పుకున్నారు!

ఆ వ్యక్తి ప్రక్కనున్న కిళ్ళీకొట్టు దగ్గర నుంచి ఒక సోడా తీసుకొచ్చి, వెంకటేశు ముఖం మీద ఆ నీళ్ళు చల్లాడు.

వెంకటేశు నెమ్మదిగా కళ్ళు విప్పాడు. మరో సోడా వెంకటేశుతో తాగించాడు. వెంకటేశు లేచి కూర్చున్నాడు.

ఆ వ్యక్తి వెంకటేశుకు చెయ్యి అందించి — "లెగు" అన్నాడు.

వెంకటేశు లేచి అతని వెంట నడవసాగాడు.

వెంకటేశు రెండడుగులు వేసిన వాడల్లా ఆత్రుతగా గిరుక్కున వెనక్కితిరిగి చూశాడు. అతని చేతిలోంచి జారిన లడ్డూలు ముక్కలై ఇసుకలో కలిసిపోయి వుంది!

వెంకటేశు భావం గుర్తించి ఆ వ్యక్తి — "ఇక అది పనికిరాదులే, రా !!" అన్నాడు.

ఆ వ్యక్తి వెంకటేశుని ఓ హోటల్లోకి తీసుకెళ్ళి బన్ను, టీ ఇప్పించాడు. వెంకటేశు ఆత్రంగా తినేశాడు.

వెంకటేశు వేపే చూస్తూ, సిగరెట్ తాగుతూ కూర్చున్న ఆ వ్యక్తి — "ఇంకో బన్ను కావాలా ?" అనడిగాడు.

వెంకటేశు సిగ్గుపడుతూ — "ఒద్దు" అన్నాడు.

"లే. పోదాం. నువ్వు నడవగలవా ?"

ఆకలి తీరడంతో వెంకటేశు కాళ్ళల్లోకి శక్తి వచ్చింది. తన ఆకలి తీర్చిన ఆ వ్యక్తి వేపు కృతజ్ఞతగా చూస్తూ — "ఓ" అన్నాడు.

"అయితే పద."

నడుస్తున్నారు.

"నా పేరు గురువులు."

వెంకటేశు తలెత్తి గురువులు వేపు చూశాడు.

"నీ గురించి చెప్పు" అన్నాడు గురువులు.

ఏం చెప్పాలో తెలియలేదు వెంకటేశుకి.

"నీ పేరు ?"

"ఎంకటేశు."

"నీకు అమ్మా, బాబూ వున్నారా ?"

"ఆ"

"మీ అయ్య ఏం చేస్తాడు."

"రిచ్చా లాగుతాడు."

"మీ అయ్య తాగుతాడా ?"

వెంకటేశు తలొంచుకుని—

"ఆ. తాగుతాడు" అన్నాడు.

గురువులు పెదవులపై చిరునవ్వు వెలిగింది. జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించుకుని—

"ఐతే, నువ్వు దొంగతనం సెయ్యడానికి కారణం అదన్నమాట" అన్నాడు పొగవదుల్తూ.

వెంకటేశు తెల్లబోతూ గురువులు వేపు చూశాడు. గురువులు దూరాన బ్రిడ్జిమీద వెడుతున్న రైలుకేసి చూడసాగాడు.

(ముగింపు పై వారం)

# నీతి లేని కథ

## నందం రామారావు

(గత సంచిక తరువాయి)

"దొంగతనం సెయ్యడం నీకిదే మొదలను కుంటాను."

"అవును! ఇదే మొదటిసారి."

ఇంకెప్పుడూ చెయ్యను కూడా!

వాళ్ళు కొట్టిన దెబ్బలతో శరీరం పుండయింది.

ఆకలితో చావనన్నా చావాలిగానీ దొంగతనం మాత్రం చెయ్యకూడదు!

"ఎంకటేశూ! పెతి ఇద్దెలోనూ కొన్ని మెలకువలుంటాయి. అవి తెలుసుకోవాలి ముందు"

వెంకటేశుకి గురువులు చెపుతున్నది అర్థం కావడంలేదు. గురువులు అదేం పట్టించుకోడం లేదు.

"దొంగతనం సెయ్యడంలో కూడా కొన్ని మెలకువలున్నాయి. నువ్వాటిని తెలుసుకుంటే, ఇక సచ్చినా నిన్ను పట్టుకోలేరు. ఆ ఇద్దెలన్నీ నీకు నేర్పితా..."

వెంకటేశు తడబడుతూ—

"అబ్బే! నే నింకెప్పుడూ దొంగతనం సెయ్యను" అన్నాడు.

గురువులు ఫెళ్లున నవ్వాడు.

"ఓరి సిట్టితండ్రీ! అందరూ మొదట ఇట్టానే సెబుతార్రా. బన్నూ, టీ తీసుకున్నావ్. ఇక ఇప్పుడు సెయ్యవ్. ఇవి అరిగిపోగానే మళ్ళీ ఆకలేస్తుంది. అప్పుడు ఈ నీతులు ఎగిరి పోతాయి. మళ్ళీ సెయ్యి లడ్డాల మీదికి పోతుంది."

వెంకటేశు బిక్కమొగం వేశాడు.

గురువులు వెంకటేశు భుజంమీద ఆప్యాయంగా చెయ్యివేసి—

"ఎంకటేశూ! నువ్వేం బాధపడి పోనక్కర్లేదు. ఈ పెపంచకంలో దొంగకానివోడు ఎవుడూలేడు. మడిసిని మరో మడిసి దోచు కుంటేనే గొప్పోడయ్యేది. గొప్పోళ్ళు కంటికన్పించకుండా దోచుకుంటారు. నువ్వు చేసేది పైకి కనిపిత్తది. అంతేతేడా! కానీ, గొప్పోడి కంటే నువ్వేనయంరా. ఆడు మేడలు కట్టుకోడానికీ, ఇనప్పెట్టెలు నింపడానికీ దోచుకుంటు న్నాడు. నువ్వు నీ కడుపు నింపుకోడానికే ఆ గొప్పోడిదగ్గర దోసుకుంటున్నావ్. ఈ పెపంచకంలో న్యాయం సెల్లుబాటు కాదురా."

వెంకటేశు మాట్లాడలేదు.

"ఎంకటేశూ! నీకు డబ్బు అక్కర్లేదా?"

'కావాలి!'

ఐనా, వెంకటేశు మాట్లాడలేదు.

"ఆకలితోమాడి సత్తానంటావా? సెప్పు?"

'అమ్మో! సావను,' వణకిపోయాడు.

"ఎంకటేశూ! నీకేం బయ్యంలేదూ. నేను అన్నీ నేర్పితా. కడుపునిండా తినొచ్చు. సక్కటిగుడ్డ లేసుకోవచ్చు. సినిమాలుకూడా సూడొచ్చు... ఏటి సినిమాలు సూడవా?"

వెంకటేశులో ఆశ చిగురుస్తోంది.

"కానీ, ఒక్క ఇసయం. నేను ఇద్దె నేర్పిందానికి నువ్వు, నీకొచ్చినదాన్లో నాకు వాటా ఇవ్వాలి. ఎక్కువ ఇవ్వొద్దులే. సెప్తావద."

"ఎక్కడికి?"

"మన కార్ఖానాకి. అక్కడ నీ లాంటోళ్ళు ఇంకా శానామందున్నారు. సూద్దువుగాని రా."

గురువులు రెండు మూడు సందులు తిరిగి ఒక పెంకుటింటి ముందు ఆగి —

"ఇదే మనిల్లు" అంటూ లోపలికి నడిచాడు.

లోపల పెద్దహాలు. హాలునిండా రకరకాల పిల్లలున్నారు. దాదాపు పాతికమందివుంటారు. వెంకటేశు వాళ్ళవేపు ఆశ్చర్యంగా చూశాడు.

"ఎంకటేశూ! ఈ పిల్లలంతా నీలాటోళ్ళే" అని వాళ్ళవేపు తిరిగి – "మీకో కొత్త నేస్తం వచ్చాడురా" అన్నాడు గురువులు.

వాళ్ళందరూ గురువులు దగ్గరకొచ్చి చుట్టూ మూగారు.

"ఒరేయ్! ఇయ్యాల ఎవరికి ఏఏటి దొరికాయ్?" అడిగాడు గురువులు.

అందరూ తాము తెచ్చినవి చూపించసాగారు. వాళ్ళు తెచ్చినవాటిల్లో కొంత తను తీసుకుని మిగిలింది వాళ్ళకిచ్చేసి —

"తిండి తిన్నార్రా" అన్నాడు.

కొందరు తిన్నామంటే, మరికొందరు లేదన్నారు.

"సరే. ఇంకపొండి."

వెంకటేశుకిదంతా అద్భుతంగా వుంది.

"ఎంకటేశూ! ఈరోజుకిది వుంచుకో," అంటూ జేబులోంచి ఐదురూపాయల నోటు తీసి వెంకటేశు చేతిలోపెట్టాడు. వెంకటేశు మొదట తీసుకోవడానికి సంశయించాడు. కానీ, ఇంటి దగ్గర జ్వరంతో మూలుగుతూ పడుకున్న తండ్రి, ఆకలితో సొమ్మసిల్లిపోయిన పిల్లలూ జ్ఞాపకం రాగానే ఆ నోటు అందుకున్నాడు.

"రేపు పొద్దున్నే ఈడకిరా" అన్నాడు గురువులు.

"అలాగే" అని తలూపాడు వెంకటేశు.

గురువులు వెంకటేశు భుజంమీద చెయ్యివేసి —

"ఎంకటేశూ! నన్ను నమ్ముకో నీకంతా మంచి జరుగుద్ది" అన్నాడు ఆప్యాయంగా.

అతని అభిమానానికి చలించిపోయాడు.

'అయ్య కూడా ఎప్పుడూ ఇంత బాగా మాట్లాడలేదు' అనుకున్నాడు.

"రేప్రొద్దున్న తప్పకుండా వొత్తా!" అన్నాడు. అంతకు మించి తన కృతజ్ఞత ఎలా చెప్పకోవాలో తెలియలేదు.

గురువులు నవ్వాడు.

వెంకటేశు బయటకు వచ్చి ఇంటిదారి పట్టాడు. ఇంటికి వచ్చాక అనిపించింది —

'తను దొంగతనాలు సేస్తున్నాడని అయ్యకీ, అమ్మకీ తెలుత్తుందేమో? ఎలా?

మర్నాడు వెంకటేశు వెళ్ళగానే అదే ప్రశ్న గురువుల్ని అడిగాడు.

ఆ మాటకి గురువులు పెద్దగా నవ్వాడు. నవ్వి — "మీ అయ్యకి తెలిసినా ఏమనడు రా. అమ్మయినా అయ్యయినా అందరికీ డబ్బు కావాలి. ఆకలి ముందు నీతులూ, నీమాలూ, పేమలూ అన్నీ బలాదూర్ తమ్ముడూ. నువ్వు డబ్బులివ్వు. మీ అయ్య మాటెడితే అప్పుడడుగు" అన్నాడు.

వెంకటేశు మాట్లాకుండా గురువుల్ని చూస్తుండిపోయాడు.

"సూడు ఎంకటేశూ! నీకేం బయ్యం లేదు. నేనున్నాను. ముందు అట్టానే వుంటుంది. పోనుపోను దీన్లోవున్న మజా నీకే తెలుత్తుంది."

గురువులు అట్లా చెపుతుంటే వెంకటేశు మారు మాట్లాడలేకపోయాడు. అదీగాక, ఇప్పుడు మళ్ళీ ఆకలేస్తోంది. నిన్న గురువులిచ్చిన ఐదు రూపాయలు ఐదు క్షణాల్లో అయిపోయాయి!

తండ్రికి జ్వరం తగ్గలేదు.

ఇప్పుడు మళ్ళీ డబ్బులు కావాలి.

అంటే, గురువులు చెప్పిన మార్గం తప్ప ఇంకోదారి లేదు!

వెంకటేశు చిన్న మనస్సు అన్నీ ఆలోచిస్తోంది.

మౌనంగా నిలబడ్డ వెంకటేశుని చూసి గురువులు నవ్వుతూ —

"రా." అంటూ తన గదిలోకి తీసుకెళ్ళాడు.

*　　*　　*

అప్పుడే వీధిదీపాలు వెలిగాయి.

కాలువగట్టునవున్న గుడిసెల్లోని మూసె దీపాలు మినుకు మినుకుమంటున్నాయి.

వెంకటేశు కాలువగట్టున నడుస్తున్నాడు.

గురువులుతో పరిచయం రెండు నెలలవుతోంది. ఈ రెండు నెలల్లోనే వెంకటేశులో చాలా మార్పు వచ్చింది.

కళ్ళల్లో కాంతి, శరీరంలో నిగారింపు వచ్చాయి. ఎర్ర చొక్కా, నీలం లాగూ వేసుకున్నాడు. రెండు చేతుల్నీ జేబులో పెట్టుకుని తీవిగా నడుస్తున్నాడు. జేబులో కొత్త ఇరవై రూపాయలనోట్లు రెండు గర గరలాడుతున్నాయి.

'ఈ రోజు యాభై రూపాయులు సంపాదించాడు, గురువులు వాటా పది రూపాయిలు పోను నలభై రూపాయలు మిగిలాయి. ఈ మధ్య డబ్బులు బాగా దొరుకుతున్నాయి. గురువులు నేర్పిన పద్ధతులు చాలా బాగున్నాయి. డబ్బు సంపాదించడం ఇంత తేలికా అన్పిస్తోంది. నిజంగా గురువులు దేవుడు. ఆకలితో చావకుండా తనని రక్షించాడు. అంతేకాదు, తను కోరింది తింటున్నాడు. సినిమాలు చూస్తున్నాడు. ఇంట్లో బియ్యానికీ, కూరలకీ, తండ్రి తాగుడికీ డబ్బునిస్తున్నాడు. ఇలా సంపాదించి కొన్నాళ్ళకి తనో పెద్ద ఇల్లు కొంటాడు. అమ్మకీ, తమ్ముళ్ళకీ, చెల్లెళ్ళకీ ఖరీదైన బట్టలు కొంటాడు. తమ్ముళ్ళని బాగా చదివిస్తాడు. అక్కకి పెళ్ళి చేస్తాడు.' ఆలోచించుకుంటూ ఇంటికొచ్చాడు వెంకటేశు.

వీరయ్య గుడిసెముందు నులకమంచంమీద పడుకుని పాటలు పాడుతున్నాడు!

'అయ్య బాగా తాగొచ్చినట్టున్నాడు' అనుకొంటూ తడిక తీసుకుని లోపలికెళ్ళాడు.

ఎల్లమ్మ అప్పుడే సానం చేసి కొడుకుకొన్న కొత్తచీర కట్టుకుని, తల దువ్వుకుని పూలు పెట్టుకుంది.

వెంకటేశు చుట్టూ చూసి పిల్లలెవరూ కనపడకపోవడంతో—

"అమ్మా! ఈళ్ళంతా ఏరే?" అనడిగాడు.

"నీలి సినిమాకు తీస్కపోయింది. కూసేపట్లో వత్తారుగానీ నువ్వురా అన్నంఎడ్తా"

"వొద్దే అమ్మా. ఇప్పుడే చపాతీ తిన్నా."

"పర్లేదు. నీకిట్టవని చేపల పులుసొండా. రెండు ముద్దలు తిందువుగానిరా" బ్రతిమ లాడింది ఎల్లమ్మ.

చేపల పులుసనగానే వెంకటేశుకి నోరూరింది, కాదనలేకపోయాడు.

ఎల్లమ్మ అన్నం వడ్డిస్తే తిని, చెయ్యి కడుక్కుని తన జేబులోంచి నలభై రూపాయలు తీసి తల్లికిచ్చేడు వెంకటేశు.

ఆ డబ్బు చూడగానే ఎల్లమ్మ ముఖం వికసించింది. "రేపు నీలికి వోణీ కొంటారా అబ్బీ" అంది.

"వూ. నీ ఇట్టం" అని వెంకటేశు నులక మంచం తీసుకుని దొడ్లో వేపచెట్టు కింద వేసుకుని పడుకున్నాడు.


రెండు నెలల క్రితం మొదటి సారిగా గురువులు సహాయంతో వెంకటేశు పదిరూపాయలు సంపాదించి తల్లి చేతిలో వుంచినప్పుడు—


"ఎక్కడివిరా?" అనడిగింది ఎంతో ఆశ్చర్యంతో.

"సంపాయిచ్చానే."

"ఏం పని సేసావు?






ఆ ప్రశ్నకి వెంకటేశు విసుక్కుంటూ—"ఏదో పనిలే" అన్నాడు.

ఎల్లమ్మ ఇక తర్కించలేదు. ఆక్షణంలో ఆ పదిరూపాయలు పెద్ద నిధిలా అన్పించింది ఎల్లమ్మకు. ఆ డబ్బుతో ఇంట్లోకి నూకలూ, వీరయ్యకి మందులూ తెప్పించింది.

ఆ తర్వాత కూడా వెంకటేశు రోజూ పది, ఇరవై ఒక్కోరోజు యాభై కూడా తీసుకొచ్చి తల్లికిచ్చేవాడు !

ఓరోజు ఎల్లమ్మ, వీరయ్యతో —

"ఎంకటేశు రోజూ ఎంతెంత డబ్బు తెత్తున్నాడో సూశావా ? ఏం పనంటే చెప్పడంలేదు" అంది.

"ఆ ఏదో పనిలేవే. ఆ ఇవరాలన్నీ నీ కెందుకు ? ఆడుతెత్తున్నాడు. మనం హాయిగా తింటున్నాం. పిచ్చిదానా ! ఈ పెపంచకంలో డబ్బుముక్కెవే. అవ్వెట్టొచ్చినా పర్లేదు. మన ఎంకటేశు బంగారమే. మనందర్నీ కూసోపెట్టి పోసిస్తున్నాడు." అన్నాడు ఆనందంగా వీరయ్య.

కొడుకు డబ్బు తీసుకొచ్చియిస్తూవుండడం ఎల్లమ్మకూ్కడా సంతోషంగానే వుంది !

"ఇదిగో, నువ్వు వాడిని పెస్నెలేసి ఇసిగించమాకు. ఆడికి కోపమొత్తే డబ్బులియ్యడు"

భర్త చెప్పింది నిజమేననిపించింది.

వీరయ్య ఇప్పుడు రిక్షాతొక్కడం మానేశాడు. వెంకటేశు రోజూ రూపాయో, రెండో చేతిలో పెడుతున్నాడు. దాన్తో పీకలదాకా సారా తాగడం, అన్నంతినడం, హాయిగా పడుకోవడం.'

అప్పుడప్పుడూ అనుకుంటాడు—

'ఇన్నాళ్ళూ ఆ పాడురిచ్చా లాగిలాగి పానాలు పోతుండేవి. ఎండలో చెమటలు కక్కుకుంటూ తొక్కేవాణ్ణి. ఇప్పుడా బాధలేదు. హాయిగావుంది. ఆ పాడురిచ్చాముఖం ఇక ఈ జన్మలో సూడను!' అని.

*    *    *

ఆరు నెలలు గడిచాయి.

ఓ రోజు —

## నీ తి లే ని క థ

సాయంత్రం ఆరు గంటలవేళ— వీరయ్యా, ఎల్లమ్మా మ్యాట్నీ సినిమా చూసి నడుస్తూ వస్తున్నారు.

ఇద్దరి మనస్సుల్లోనూ వెంకటేశు మెదలుతున్నాడు.

'ఇయ్యాల ఎంకటేశు మంచి సుట్ట కొని తెత్తానన్నాడు. ఇంటికెళ్లగానే కూడు తిని, బయట నులకమంచంమీద పడుకుని సుట్ట తాగుతుంటే నా సామిరంగా సొరగమే కనిపిత్తుంది.' అనుకుంటూ ఆనందపడుతున్నాడు వీరయ్య.

'ఎంకటేశు ఇయ్యాల మిఠాయి తెచ్చిత్తానన్నాడు. తొరగా ఇంటికెల్లాలి.' అని అనుకుంటోంది ఎల్లమ్మ.

ఇద్దరూ హుషారుగా నడుస్తున్నారు. సందుదాటి బజారురోడ్డు మీదికి రాగానే అక్కడ పెద్ద గుంపు కనపడింది.

'ఏందబ్బా !' అనుకుంటూ కుతూహలంగా ఇద్దరూ ఆ గుంపులో చొరబడ్డారు.

ఆ గుంపు మధ్య వెంకటేశు తలొంచుకుని నిలబడి వున్నాడు !

ఒక పోలీసు వెంకటేశు చేతులకు బేడీలు వేస్తున్నాడు. చుట్టూవున్న జనం వెంకటేశుని తిట్టిపోస్తున్నారు. అది చూసిన వీరయ్య చటుక్కున ఎల్లమ్మ చేతిని పట్టుకుని ఆ గుంపు లోంచి బయటపడి పక్క సందులోకి వెళ్ళిపోయాడు.

"ఏందయ్యా ఇట్టా లాక్కొచ్చావ్ ?" అంది ఎల్లమ్మ తన చేతిని విడిపించుకుంటూ.

"ఏందేవిటే ? ఇంకూస్సేపు మనం అక్కడుంటే ఎంత పెమాదం జరిగేదో తెలుసా?"

"పెమాదమా ? ఏంటయ్యా ?"

"ఎంకటేశుని పోలీసోళ్ళు పట్టికెడుతున్నారు సూశావా ?"

"అవును ఎందుకు బేడీలేశారు?" ఆత్రంగా అడిగింది.

"ఎందుకేవిటే ఎర్రిమొహమా ? ఆడు జేబు దొంగతనం సేసాడు. జనం తిట్టడంలా?"

ఎల్లమ్మ ముఖం తెల్లగా అయింది.

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి !

"ఆడిని ఇడిపించవయ్యా."

"ఇంకా నయంలే. మనం సెప్తే ఇడిసిపెడ్తారా ? శిచ్చ పూర్తవ్వాల ఇడిసిపెట్టాల. మనం ఆడి అమ్మా, అయ్యా అని తెలిత్తే మనల్ని కూడా ఆ పోలీసోళ్ళు పట్టుకుపోతారు."

ఆ మాట వినడంతోనే ఎల్లమ్మకి దుఃఖంతో పాటుగా భయం కూడా కలిగింది !

"నిజంగానా !"

"అవునే. అందుకే, తొందరగా ఇంటికి నడు." అన్నాడు వీరయ్య.

ఇద్దరూ ఇంటి కొచ్చారు.

అప్పటికే పిల్లలు అన్నం తిని పడుకున్నారు.

వీరయ్య కూడా అన్నం తిని బయట నులక మంచం వేసుకుని కూర్చున్నాడు.

## చేతులు లేని డ్రైవర్లకు కార్లు !

కాళ్ళు, పాదాలు, భుజాలు ఉపయోగించి నడపగల కార్లను జపానులో తయారు చేశారు. థాలిడేమైడ్ వలన వికలాంగులైన వారికోసం, ఇతర వికలాంగుల కోసం ఇవి తయారుచేశారు. ఈ కార్ల తలుపులకు బయటి నుండి లోపల నుండి పాదాలతో తెరవ వచ్చు. స్టీరింగ్‌ను ఎడమ పాదంతో నిర్వహిస్తారు. ఎక్కువబాగం స్విచ్‌లు తలుపుకు లోపలవైపు అమర్చబడినాయి. వీటిని భుజాలతో ఉపయోగించవచ్చు. ఇంతవరకు ఒక కాలు, లేక ఒక చేయి లేని వారు, చక్రాల కుర్చీ ఉపయోగించే వారు మాత్రమే నడుపగల కార్లు వచ్చాయి. ఈ కొత్త కార్లను ఇటీవలే మార్కెట్లో విడుదల చేశారు.

# తిరుపతిని తెలుగువారు వదులుకుంటారా ?

అనాది కాలం నుంచీ తెలుగువారికి తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆరాధ్య దైవం. శ్రీవేంకటేశ్వరుని గుడికి వెళ్లే కాలిబాట వేయించినది ఆది శంకరాచార్యులని కొందరి అభిప్రాయం. భాషాభేషజాలు మనుషుల మనస్సులను మలినం చేసేవరకూ వేంకటేశ్వర స్వామి దేవాలయం వున్న తిరుమల — తిరుపతి ఏ భాషా ప్రాంతానికి చెందినదన్న రాజకీయ మీమాంసరాలేదు. ఆ క్షేత్రంలోని పూజారులు స్మార్తులు. ఒకరిద్దరు శుద్ధశైవ వెలనాటి వైదికులుకూడా వున్నారు. ఇప్పుడు ప్రస్తావన ఎందుకు చేయవలసినదంటే తిరుత్తణికి ఏర్పడిన ప్రమాదమే తిరుమల — తిరుపతికి కూడా యేర్పడే సూచనలు విజ్ఞులకి కనిపించుతున్నాయి.

(1) దేవస్థానం ఉద్యోగులలో ఎక్కువ మంది తెలుగువారే అయినా తమిళం మాట్లాడడం యీ విలేఖరి ఇటీవల గమనించాడు.

(2) యాత్రికుల సౌకర్యానికి అటనట వ్రాయించిన సూచనలు తమిళంలో వున్నాయి. తెలుగును సంపూర్తిగా నిర్లక్ష్యం ఇంతవరకూ చేయలేదు.

(3) ఇక కళ్యాణం. పూజా విధానాలలో తమిళ పద్ధతే వ్యక్తమవుతున్నది. సంకల్పం చేయించేటప్పుడు, మంగళసూత్రధారణ జరిగే వరకూ భూదేవి, శ్రీదేవిలనుస్వామి వారికి కుడి ప్రక్కన ఉంచుతున్నారు. ఇది స్మార్త విధానమా ? తమిళ వివాహ తంతులో ఇదొకటి కాదా ?

(4) ఆ తర్వాత అలివేలు మంగ, నాంచారమ్మ అనే దేవతలకు బదులు భూదేవి, శ్రీదేవి అని ఎలా వచ్చారు ? ఏ పురాణంలో ఈ పేరులున్నాయి. శ్రీ వేంకటేశ్వరుని పేరు శ్రీనివాసుడుగా ఎలా మారింది ? శాస్త్రం సంగతి అలా వుంచినా కొన్ని శతాబ్దాలుగా తెలుగువారి ఇలవేల్పుగా విలసిల్లుతూ వచ్చిన శ్రీ వేంకటేశ్వరస్వామిని తమిళ సోదరులకు ధారాదత్తం చేసే ఎత్తులో ఇప్పుడు ఆ క్షేత్రంలో కనిపించేవన్నీ ఒక భాగమా అని సందేహించడం తప్పవుతుందా ?

చిత్తూరు జిల్లా ద్విభాషా ప్రాంతమే కాదు కన్నడిగులు కూడా వున్నారు. ఆ జిల్లాలో తమిళ రాజకీయకులు కుండబద్దలు కొట్టినట్లు ఒక ప్రకటన అలవోకగా చేసి తమ అనుచరులను పరోక్షంగా ప్రోత్సహించి తిరుపతిలో తమిళభాషా ప్రాబల్యాన్ని అధికం చేస్తూండగా, కన్నడిగులు చూస్తూ వూరుకోవడం లేదు, వారు కూడా మరొక వైపు నుంచి కొన్ని ఎత్తులు వేస్తున్న సూచనలున్నాయి.

అన్ని విధాలా, ఎప్పుడూ నష్టపడ్డమే తెలుగువారి ప్రత్యేకత కాబోలు. ఆఖరుకు ధర్మసత్రంలో ఒక గది కావాలన్నా తమిళంలో మాట్లాడితే సులభంగా లభించుతుంది. బస్సులలో కండక్టర్లలో ఎక్కువ మంది తమిళం మాట్లాడుతున్నారు. దేవుడి పూజా విధానం పూర్తిగా తమిళ పద్ధతిలోకి మారింది. రాజకీయవాదుల కళ్ళు తిరుపతి వెంకన్న మీద ఎందుకు పడినయ్యో వేరే చెప్పడం అవసరమా ?

— వి. ఎస్. అవధాని

---

ఎల్లమ్మ వచ్చి మంచం దగ్గరగా క్రింద కూర్చుని — "ఆడిని ఎప్పటికి ఇడుత్తారో" అంది దిగులుగా.

వీరయ్య మాట్లాడలేదు.

వీరయ్య రోజూ ఈ పాటికి రెండు మూడు గ్లాసుల సారా తాగేవాడు. కానీ, ఈ రోజు ఇంకా తాగలేదు. దానిక్కారణం జేబులో డబ్బులు లేక పోవడమే. వెంకటేశు సాయంత్రం అయ్యేసరికి మూడు నాలుగు రూపాయులు చేతిలో పెట్టేవాడు.

ఈ రోజు డబ్బుల్లేవు.

సారా లేదు.

చాలా చిరాగ్గా వుంది.

ఎల్లమ్మ ఆవలిస్తూ లేచి —

"ఇక రేపట్నుంచీ మువ్వు రిచ్చాలాగాలయ్యో. నేకపోతే మళ్ళీ మనకు కూడుండదు." అని లోపల కెళ్ళిపోయింది.

భార్య మాటలు వీరయ్యకి మనసులో గునపాలు దింపినట్లయింది !

తను మళ్లా రిచ్చా లాగాలా ?

తనవల్లకాదు. ఎండలో రిచ్చా లాగుతుంటే తన పానాలు పోతాయి. అదీగాక, తనిక రిచ్చా తొక్కనని అందరితో సెప్పాడు. ఇప్పుడు రిచ్చా తొక్కితే తనకెంత సిన్నతనం ? సిన్నతనమేమరి ? మరయితే తిండెలా ? సారా ఎలా ? రేపటికి తిండి సంగతి దేవుడెరుగు. ముందు తనకిప్పుడు సారా కావాలి. నాలుక చిమచిమలాడుతోంది. నరాలు తిమ్మిర్లెక్కిపోతున్నాయి ! సారా చుక్క గొంతులో పడకపోతే పానాలు నిలిచేట్టులేవు. ఇప్పుడేం సెయ్యాలి ?

వీరయ్య కూర్చోలేకపోయాడు. లేచి తడిక తోసుకుని లోపలకొచ్చాడు. ఒక మూలగా గుడ్డి దీపం వెలుగుతోంది. అందరూ చాపమీద పడుకుని నిద్రపోతున్నారు.

ఇప్పుడు తక్షణం సారా త్రాగడానికి డబ్బులు కావాలి ! ఇంట్లో అమ్మే వస్తువు ఏదైనా వుంటుందేమోనని చుట్టూ చూశాడు. ఏమీ కనబడలేదు.

ఇంతలో, అతని చూపులు ఒకచోట నిలిచి పోయాయి. అక్కడ ఒక మూలగా పదహారేళ్ళ నీలి నిద్రపోతోంది.

గుడ్డిదీపపు కాంతిలో నీలి — అప్పుడే వికసిస్తున్న పువ్వులా, పక్వానికొస్తున్న పండులా లేతగా, అందంగా కనిపిస్తోంది.

అతని మనస్సులో ఏవేవో ఆలోచనలు.

నీలినే పరీక్షగా చూస్తున్న వీరయ్యకి ఆ పిల్ల తన రక్తాన్ని పంచుకుపుట్టిన కూతురిలా అనిపించడంలేదు.

తన సారాకి, తన తిండికీ డబ్బు సంపాదించే బొమ్మలా కనిపించింది.

'తనిక రిచ్చా ఎయ్యనక్కర్లేదు. తిండికీ, సారాకీ కొదవుండదు. కష్టపడకుండా సొరగ సుఖాలు అనుభవించొచ్చు' అని అనుకున్నాడు.

చప్పుడు కాకుండా తడిక దగ్గరకు లాగి ఆనందంగా బయటకొచ్చాడు వీరయ్య

బయట చలిగా వుంది.

దాంతోపాటుగా గాలి విపరీతంగా వీస్తోంది.

ఆ గాలికి ఎదురుగా వున్న నేరేడుచెట్టు ఏ క్షణంలోనైనా విరిగిపోవడానికి సిద్ధంగా వున్నట్టుగా వుంది !

ఆకాశంలో నక్షత్రాలు ఎప్పుడో కునుకు తీశాయి. ఒక నల్లని మేఘం చంద్రుణ్ని కప్పేయడంవల్ల అంతా చీకటిగా వుంది !

ఆ చీకటిలోనే వీరయ్య వడివడిగా నడుస్తున్నాడు— డబ్బుగల బాబులకు కూతురు 'నీలి'ని అమ్మడానికి !

ఎక్కడో దూరాన పిడుగుపడిన ఘర్జనవల్ల నిద్రపోతున్న నీలి వులిక్కిపడి తల్లిని గట్టిగా కౌగలించుకుని మరీ పడుకుంది.

ఆ చీకటిలో వీరయ్య ఇంకా నడుస్తూనే వున్నాడు ! ★